క్లుప్తంగా

ఎన్‌డీడీపై అవగాహన ర్యాలీ



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో బుధవారం ఎన్‌డీడీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లీలమ్మ, హెచ్‌ఏలు బాలీశ్వరయ్య, మాధవి, ఫార్మాసిస్టు పుష్పకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఎన్‌డీడీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి ప్రసూనరాణి తెలిపారు.

మల్దకల్: నులి పురుగుల నివారణకు అంగన్‌వాడీ టీచర్లు తమ వంతు కృషి చేయాలని వైద్యాధికారి స్వరూపారాణి కోరారు. బుధవారం మండల కేంద్రంలో రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశాన్ని నిర్వహించారు. గురువారం జాతీయ నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారందరికి మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



మానవపాడు: మండల కేంద్రంతోపాటు చెన్నిపాడులో వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాష్ ఆధ్వర్యంలో రైతుబీమా దరఖాస్తులను బుధవారం రైతుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 సంవత్సరాలు ఉన్న రైతులు అర్హులని తెలిపారు. రైతుబీమా కోసం దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్‌బుక్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇవ్వాలని సూచించారు.

పత్తి విత్తనాల పరిశీలన

మానవపాడు: ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన నాణ్యమైన విత్తనాలను నాటుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శివారుప్రాంతంలోని పత్తి విత్తనాలను పరిశీలించారు. పత్తి, కంది తదితర విత్తనాలను ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్న వాటిని విత్తుకోవాలని సూచించారు.

పార్ట్‌టైం స్వీపర్ల వేతనాలు పెంచాలి

శాంతినగర్: దశాబ్దాల కాలంగా ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ వేతనంతో పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్ల వేతనాలు పెంచాలని సంఘం వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రామలింగం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. 24 రోజులుగా స్వీపర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.27 వేల వేతనం అమల్లోకి వచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

ప్రతి పంచాయతీలో మొక్కలు నాటాలి

మానవపాడు: మండలంలోని బోరవెల్లి, జల్లాపురంలో బుధవారం ఎంపీడీఓ రమణరావు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి పంచాయతీ ఆధ్వర్యంలో హరితహారం కింద మొక్కలను నాటాలని సూచించారు. వర్షాలు కుస్తున్నందున ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆత్మగౌరవ యాత్ర వాల్‌పోస్టర్ విడుదల

ధరూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించే దళిత జర్నలిస్టుల ఆత్మగౌరవ యాత్ర కరపత్రాలు, పోస్టర్‌ను పాగుంట వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ నాగర్‌దొడ్డి వెంకట్రామిరెడ్డి బుధవారం జర్నలిస్టులు జగన్, తిరుమలేష్‌లతో కలిసి విడుదల చేశారు. సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల కృషి వెల కట్టలేనిదని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని దళిత జర్నలిస్టులు హాజరై సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

వడ్డేపల్లిలో 23న వైద్య శిబిరం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్ పట్టణంలో కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో 23న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సప్తగిరి శ్రీను బుధవారం ప్రకటనలో తెలిపారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. గుండె, గర్భిణులు, కీళ్ల నొప్పులకు జనరల్ ఫిజీషియన్, పంటి నొప్పులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, పరీక్షలు చేయించుకోడానికి శాంతినగర్‌లోని సప్తగిరి మెడికల్ షాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పంచాయతీలకు పుట్టెడు కష్టాలు

- సిబ్బంది జీతాలకు సరిపోని ఆస్తి పన్ను
- పనులు పూర్తయిన అందని బిల్లులు
- 8 నెలల్లో పూర్తి కానున్న సర్పంచ్‌ల పదవీకాలం



ప్రాగటూరులో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం

ఉండవెల్లి: సరిపడా నిధులు లేకపోవడంతో పంచాయతీలకు పుట్టెడు కష్టాలు తప్పడం లేదు. కొందరు సర్పంచ్‌లుగా ఎందుకున్నామంటూ తలలు పట్టుకుంటున్నారు. పంచాయతీల ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో గ్రామ పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చిన్న పంచాయతీల పరిధిలో దాదాపు 100 నుంచి 200 లోపు ఇళ్లు మాత్రమే ఉండడంతో ఆస్తి పన్నుల వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఏడాది పన్నులు వసూలైనా సిబ్బందికి రెండు నెలల వేతనాలు సరిపోవడం లేదు. అలంపూర్ నియోజకవర్గంలో 7మండలాలు, మూడు మున్సిపాలిటీలు, 124 పంచాయతీలు ఉన్నాయి. అలంపూర్‌లో భైరంపల్లి, జిల్లెలపాడు, మానవపాడు మండలంలో గోకులపాడు, శ్రీనగర్, ఉండవెల్లిలో మారమునగాల-2, చిన్న ఆముదాలపాడు, రాజోళి మండలంలో పశ్చిమ గార్లపాడు చిన్న పంచాయతీలుగా ఉన్నాయి. ఇటిక్యాలలో-4, అయిజలో-4 పంచాయతీలు ఉన్నాయి. మూడున్నర సంవత్సరాలుగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పెద్ద పంచాయతీలు నిల్వ ఉన్న నిధులతో నెట్టుకొస్తుంటే, చిన్న పంచాయతీలకు మాత్రం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. తప్పని పరిస్థితుల్లో సర్పంచ్‌లు తమ జేబు నుంచి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకొద్దామనుకున్నా.. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో సర్పంచ్‌లు నోరు మెదపడంలేదనే విమర్శలు వస్తున్నాయి.

శిథిలావస్థలో భవనాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవడంతో కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. పక్క భవనాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల, శిథిలమైన భవనాలలోని పంచాయతీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కొందరు సర్పంచ్‌లు తమ నివాసాలనే కార్యాలయాలుగా మార్చుకుని సిబ్బందితో సమావేశం అవుతున్నారు.

నిధుల కొరత



కొత్తగా ఏర్పడిన పంచాయతీకి మొదటి సర్పంచ్‌గా గెలిచాననే సంతోషం ఉంది. ప్రభుత్వం నుంచి నిధుల కొరత చాలా వేధిస్తుంది. దీంతో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నాం. వర్షాకాలంలో బురద రోడ్లు, అస్తవ్యస్తమైన డ్రెయినేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సునీత, మారమునగాల-2, సర్పంచ్

బ్రిడ్జి నిర్మాణం సకాలంలో పూర్తి చేయండి



బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: పెద్దవాగుపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్-కొత్త బస్టాండ్ మధ్య చేపట్టిన కొత్త బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైలెవల్ బ్రిడ్జికి ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. గతంలో ఒకసారి ఇదే నిర్మాణానికి టెండర్ వేసి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారని, కాంట్రాక్టర్ పనిచేయకపోవడంతో ఆర్ అండ్‌బీ అధికారులు కాంట్రాక్ట్ రద్దు చేసి తిరిగి కొత్త కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. పనులు నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చే య ఆలన్నారు.

పాఠశాలల సందర్శన



ధరూరు: మండల కేంద్రంలోని హరిజన చెర్రి ప్రాథమిక పాఠశాలతో పాటు మన్నాపురం, దోర్నాల పాఠశాలలను కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, శుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. దోర్నాలలో వంట గది శిథిలావస్థలో ఉన్నదని, వర్షాకాలంలో వంట చేసేందుకు ఇబ్బందికరంగా మారిందని వంట ఏజెన్సీ మహిళలు జీహెచ్‌ఎం దృష్టికి తెచ్చారు. ఆయన వెంట సీఆర్‌పీ నర్సింహులు ఉన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా సంఘం సభ్యులు

గద్వాల అర్బన్: పెరుగుతున్న నిత్యావసర, కూరగాయాల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద ఆరోపించారు. ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో కూరగాయాలతో నిరసన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలపై భారం మోపుతున్నారని, కార్పొరేట్, దోపిడీదారులకు దేశాన్ని దోచిపెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జయమ్మ, లక్ష్మి, వెంకటమ్మ, మనోరమ, సత్యమ్మ, రేవతి తదితరులు ఉన్నారు.

త్రైతసిద్ధాంతంపై ప్రచారం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని శివనంపల్లిలో త్రైత సిద్ధాంతం, ప్రబోధా సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ కూడా సభ్యసమాజంలో ఇతరులతో మంచిగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో బీచుపల్లి, వెంకటేష్, వంశీ, మహేంద్ర, భాస్కర్‌రెడ్డి, పావని, భాగ్యమ్మ, స్వాతి, మహేశ్వరి తదితరులు ఉన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్సీతో డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు

అలంపూర్: డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎర్రవల్లి డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి సమస్యలను విన్నవించగా, సానుకులంగా స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చినట్లు చెప్పారు. డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించినట్లు తెలిపారు. ఆరోగ్యాలను కాపాడుకోని కుటుంబాలకు అండగా ఉండాలని చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నారాయణ, అధ్యక్షుడు ఉపేంద్ర బాబు, వినోద్ కుమార్, ఉదయ్‌కుమార్, కృష్ణయ్య, రవి, సామెల్, శాంతన్న, రాజేష్, బజారి, హరిబాబు, దివాకర్ బాబు, రాజ్ కుమార్, కృష్ణ, సతీష్, వంశీ తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం పంచామృతాభిషేకాలు, పూలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో అర్చకుడు ఆంజనేయస్వామి, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక గర్జన విజయవంతం చేయాలి



గట్టులో పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గట్టు: కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్మికగర్జనను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న 2లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలన్నారు. కనీస వేతనాల 5జీఓలను గెజిట్ చేసి మిగతా 68 షెడ్యూల్ జీఓలు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలన్నారు. 4లేబర్ కోడ్లులను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోరారు. కార్యక్రమంలో నాగరాజు, జారమ్మ, తాయమ్మ, నాగేంద్రమ్మ, మాణిక్యమ్మ, భీమేష్, వీరేష్, వెంకన్న, హనుమంతు, శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్ ఆధ్వర్యంలో కార్మిక గర్జన పోస్టర్ విడుదల చేశారు. కార్మికులు హైదరాబాద్‌లో సభను విజయవంతం చేయాలన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తం



ఉండవెల్లి: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ రాజు సూచించారు. బుధవారం మండలంలోని సైబర్ క్రైమ్‌పై జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యాశ, అవగాహన లేకపోవడం వల్ల సైబర్ క్రైంలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 155260కు ఫోన్ చేయాలని సూచించారు.

కురిసిన వర్షం.. రైతుల హర్షం



ఉండవెల్లిలో భారీ వర్షంతో జలమయమైన రోడ్లు



ఉండవెల్లిలో కురుస్తున్న వర్షం

మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి ముసురు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేయడానికి పరుగులు తీశారు. రోడ్లన్నీ జలమయ్యమయ్యాయి. సాయంత్రం సమయంలో భారీగా వర్షం కురిసింది.

–ఉండవెల్లి

మొక్కలు నాటిన ఎక్సైజ్ పోలీసులు

అయిజ: హరితహారంలో భాగంగా మండలంలోని మేడికొండ శివారులో బుధవారం ఎక్సైజ్ పోలీసులు కర్జూర మొక్కలను నాటారు. ఎక్సైజ్ సీఐ గోపాల్ గ్రామస్తులతో మాట్లాడారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలన్నారు. అవసరమైన మేరకు నీరుపోయాలని, కలుపు మొక్కలను తొలగించాలని, రక్షణ కవచం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్, సిబ్బంది రాజు, షబ్బీర్, కల్లు గీత కార్మికులు పాల్గొన్నారు.



పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి

గద్వాల అర్బన్: పార్టీ కోసం అందరూ కష్టపడి పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. లత్తీపురం, బసల్‌చెర్వు, బీరెల్లి, గుర్రంగడ్డ, తాటికుంట, నేతొనిపల్లి, చిన్నతండా, మల్దకల్, పాల్వాయి, జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన పలువురు బుధవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు వారికి కండువా కప్పారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు.

కాంగ్రెస్ బిక్ష వల్లే ఎమ్మెల్యే పదవి

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష వల్లే అబ్రహం గతంలో ఎమ్మెల్యే అయ్యారని పార్టీ మండల అధ్యక్షుడు రుక్మందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లిలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ కాంగ్రెస్ మీద అయితే ఎమ్మెల్యే అబ్రహం రైతువేదికల వద్ద సమావేశాలు పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారో, ఆ పార్టీయే లేకుంటే ఆయన ఎమ్మెల్యే అయ్యేవాడా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పి.. కనీసం 6 గంటలు కూడా ఇవ్వడంలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డబుల్ బెడ్రూంలు, రుణమాఫీ, విత్తనాల సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, పంట నష్టం, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు ఎన్ని ఇచ్చారని రైతువేదికల వద్ద సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, వెంకటేష్, జయపాల్‌రెడ్డి, రాజారెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, ఉమాపతి, ఉశేన్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్



బైండోవర్ చేసిన వారితో ఎక్సైజ్ అధికారులు

గట్టు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మందిని బుధవారం ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ జుబేర్ మోహినోద్దిన్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో కిరాణ దుకాణదారులతో పాటుగా ఇతర గ్రామాలకు చెందిన వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. సారాయి తయారు చేసే వారికి బెల్లాన్ని విక్రయించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇతర గ్రామాలకు చెందిన కొందరు కర్ణాటక లిక్కర్ బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించి వారిని కూడా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. మరోమారు ఇలాంటి నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా, జైలు శిక్ష విధించనున్నట్లు హెచ్చరించి వదిలేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

టెక్నికల్ అసిస్టెంట్‌పై కూలీల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కూలీలు

రాజోళి: ఉపాధి హామీ పనులకు వెళ్లే వెళ్లే కూలీలతో కమీషన్లు వసూలు చేస్తున్నాడని టెక్నికల్ అసిస్టెంట్‌పై కూలీలు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని తుమ్మిళ్లలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రభాకర్ స్థానిక కూలీలతో డబ్బులు వసూలు చేస్తున్నాడని వారు ఆరోపించారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ అంజనమ్మకు వినతి పత్రం అందజేశారు. వారంలో తమకు బిల్లులు రాగానే ఒక్కొక్కరి నుంచి రూ.200 చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా దీనిపై స్పందించిన టెక్నికల్ అసిస్టెంట్ మాట్లాడుతూ.. గ్రామంలో పనిచేయకుండా తమ పేర్లు రాయాలని, తమకు బిల్లులు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారని, వారికి సహకరించనందుకు, తనపై కమీషన్ వసూలు చేశానని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ఆయన అన్నారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అలంపూర్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

అలంపూర్: పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో తమ డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికుల నిరసన సమ్మె బుధవారం కొనసాగింది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహా వారికి మద్దతు పలికి మాట్లాడారు. పంచాయతీ కార్మికులు 13 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి సమ్మె విరమింపజేయాలన్నారు. ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో జీతాలు పెంచుతున్న ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాలన్న, శివానంద్, అఖిల్, మద్దిలేటి, ఏజెంద్ర, సునీల్, దాసు తదితరులు ఉన్నారు.

శాంతినగర్: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. జులైనా ప్రభుత్వం స్పందించడంలేదని, సమ్మె ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పురుషోత్తం, గోపాల్, రామన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులను ఆదుకోండి



కుటుంబసభ్యులను ఓదారుస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు

అయిజ: తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని పట్టణ ప్రజలు కోరారు. పట్టణానికి చెందిన ప్రవీణ్ కుమార్ (35) కొన్ని రోజులనుంచి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందింది. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో వీరు అనాథలయ్యారు. ఎమ్మెల్యే అబ్రహం, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు వేర్వేరుగా వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముగ్గురు పిల్లల చదువుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.